విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 113 | శుక్రవారం 21. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ

**నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం**

**సంస్కరణలపై సుప్రీంలో విచారణ**



ఢిల్లీ (తెలంగాణ వాణి) నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పిఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో మిగతా 2లో..

## మూడు శాఖల్లో ముప్పేట అవినీతి

**టేబుల్‌పై డిఎంకె అవినీతి ఫైల్స్**

**వాటిని అప్పుడే తెరిచేలా చేయకండి**

**తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు**



చెన్నై, ఆగస్ట్ 19 : ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు మిగతా 2లో..

## పోలీస్ శాఖ పునర్వ్యవస్థీకరణ

**సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖలో మార్పులు**

**513 మంది సిబ్బంది వివిధ విభాగాలకు బదిలీ**



ఢిల్లీ (తెలంగాణ వాణి) మారుతున్న సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ విభాగాలకు చెందిన 513 మంది సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. బదిలీ అయిన 513 మందిలో 5 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు ఉన్నారు. వీరితో పాటు 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు డీజీపీ తెలిపారు. ఈ బదిలీల్లో భాగంగా అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. కొత్త బాధ్యతలు చేపట్టే ముందు సిబ్బందిని రెండు నెలల పాటు వివిధ విభాగాల్లో అటాచ్‌మెంట్ ద్వారా పనిచేయించనున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, సామర్థ్యం ఆధారంగా తుది బాధ్యతలను నిర్ణయించనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

# భజన మాటున గంజాయి గుప్పుమంటోందా..?

- భక్తి కేంద్రాలే అడ్డాలుగా మత్తు దందా?
- ఉక్కుపాదం మోపుతున్నా ఆగని అక్రమ రవాణా, వినియోగం
- యువత భవిష్యత్తుపై తల్లిదండ్రుల్లో ఆందోళన



**ఉమ్మడి నిజామాబాద్, ఆగస్టు 20, (తెలంగాణ వాణి** స్పెషల్ కరస్పాండెంట్)జఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో నిషేధిత గంజాయి అక్రమ రవాణాతో పాటు వినియోగం అధికంగా ఉందని ప్రజల నుండి ఆరోపణలు విపరీతంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖలు అక్రమ గంజాయి రవాణాపై వినియోగంపై ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ గంజాయి రవాణా, వినియోగం ఆగడం లేదని ప్రజల నుండి వినిపిస్తున్న ప్రధాన ఆరోపణ. ఒకవైపు అధికారులు కేసులు నమోదు చేస్తుంటే మరోవైపు గంజాయి అమ్మకం దారులు, వినియోగదారులు హెచ్చుగా పెచ్చరిల్లుతున్నారని వినికిడి. యువత గంజాయి కి బానిస అవుతుండడంతో, సామాన్య ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది, అనడంలో అతిశయోక్తి లేదనే చెప్పవచ్చు. విశ్వాసనీయమైన సమాచారం మేరకు, వివరాల్లోకి వెళితే నిజామాబాద్ ఉభయ జిల్లాలలోని కొన్ని భక్తి, భజన కేంద్రాలలో, భక్తి మాటునా ఘాటైన గంజాయి పొగ గుప్పుమంటుందని వాదనలు వినిపిస్తున్నాయి. భక్తి కేంద్రాలే అడ్డాగా కొందరు అక్రమార్కులు సందులో సడే మియా అన్న చందంగా గంజాయి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు విశ్వాసనియ సమాచారం. విద్యార్థులు, యువత మొదలు రిటైర్డ్ ఉద్యోగుల వరకు చాలామంది ఘాటైన గంజాయికి అలవాటు పడ్డారని తెలుస్తోంది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు సంపన్న వర్గాల యువత సహితం, గంజాయికి బానిసవుతుండడంతో, చాలామంది ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎదిగిన బిడ్డలను గంజాయి మహమ్మారి నుంచి కాపాడుకోవాలని, పిల్లల భవిష్యత్తుపై దిగులుతో, తల్లిదండ్రులు పిల్లలను వారించలేక, అధికారులకు సమాచారం ఇవ్వలేక, తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు ఉభయ జిల్లాలలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. 100 గ్రాములు మొదలు కిలోల వరకు అధికారులు అక్రమ గంజాయి రవాణాలను అడ్డుకుంటూ, అరెస్టుల పరంపరా కొనసాగిస్తూ, గంజాయి రవాణా పై, వినియోగంపై ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ, అక్రమార్కులు మాత్రం కొత్త పుంతాలు తొక్కుతూ భక్తి కేంద్రాలనే, వారి వ్యాపార కేంద్రాలుగా మలుచుకుని, గంజాయి దంధాను, మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తు న్నారని, గుసగుసలు వినిపిస్తున్నాయి. నిజామాబాద్ అర్బన్, రూరల్ ఏరియాలతో పాటుగా, ఆర్మూర్ నియోజకవర్గం, భీంగల్ నియోజకవర్గం, మరోవైపు కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు, బాన్సువాడ నియోజకవర్గం, జుక్కల్ నియోజకవర్గం మరియు మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలలోని మారుమూల ప్రాంతాలతో పాటు, త్రివేణి సంగమంగా పిలవబడే బిచ్కుంద, మద్నూర్, పిట్లం ప్రాంతాలలో ప్రతినెల పదుల సంఖ్యలో భక్తి కేంద్రాలకు, భజన కొరకై ప్రజలు రావడం ఆనవాయితీగా వస్తున్నది. దీన్ని ఆసరా చేసుకుని గంజాయి అక్రమ రవాణా వ్యాపారులు, వినియోగదారులకు గంజాయి సరఫరా చేస్తున్నట్టు విశ్వాసనీయంగా తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ ఎక్సైజ్ శాఖ అధికారులు గంజాయి రవాణాపై వినియోగంపై ఉక్కు పాదం మోపుతున్న అక్రమార్కులు సైతం భక్తి కేంద్రాలని వ్యాపార కేంద్రాలుగా మలుచుకుని దందా సాగిస్తున్నారని, ఉభయ జిల్లాలోని ప్రజలు గుసగుసలాడుతున్నారు. మరికొంత సమాచారంతో రేపటి సంచికలో మళ్లీ కలుద్దాం!

## 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** తమిళనాడు రాష్ట్రంలోని మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ప్రారంభమైన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి తెలంగాణ తరఫున ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ముఖ్యంగా సింగరేణి కాలరీస్‌కు ప్రాధాన్యతా ప్రాతిపదికన బొగ్గు బ్లాకులు కేటాయించాలని, సింగరేణిపై వేలం విధానాన్ని బలవంతంగా రుద్దవద్దని కోరనున్నారు. అంతర్రాష్ట్ర నదీ జలాలు, మౌలిక వసతులు, ప్రాంతీయ అభివృద్ధి తదితర అంశాలపై దక్షిణాది రాష్ట్రాల సమిష్టి ప్రయోజనాల కోసం సమావేశంలో చర్చ జరగనుంది.

## ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి

- 15 బృందాలతో సోదాలు
- ఇబ్రహీపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో సోదాలు
- ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలు
- ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో కేసు నమోదు
- పత్రాలు ఇతర కీలక ఆధారాలపై ఏసీబీ అధికారులు ఆరా



## సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం.. నన్ను బాధ్యురాలిని చేయొద్దు

- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) ఇచ్చిన షోకాజ్ నోటీసులు
- ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో డీఏసీ వివరణ
- సుస్మిత వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు.
- నాకు సంబంధం లేని అంశంలో నా వివరణ కోరడం సముచితం కాదు.
- కాంగ్రెస్ నాయకత్వం, పార్టీ నియమావళిపై నాకు గౌరవముంది
- షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలి



## పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా బీఆర్ఎస్

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసేలా కాంగ్రెస్ సర్కార్ జీవో 97 తీసుకురాగా.. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కొనసాగుతున్న విషయం తెలిసిందే. జీవో 97కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ మద్దతుగా నిలిచి ఆందోళనల్లో పాల్గొంటుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు, వారితో బీఆర్ఎస్వీ కలిసి చేస్తున్నపోరాటానికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్టు ట్వీట్ చేశారు.విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన వీడియోను ట్యాగ్ చేస్తూ.. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల వేలాదిమంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందన్నారు. శాంతియుతంగా నిరసనను తెలుపుతున్న విద్యార్థుల మీద కొన్ని చోట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన దృశ్యాలు నన్ను కలచివేశాయి.

## డిసెంబర్ నాటికి పంప్‌హౌస్ పనులు పూర్తి చేయాలి

**రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి**



కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకుని హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 53 వేల ఎకరాలకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద రూ.1,648 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను గురువారం మంత్రి పరిశీలించారు. అండర్ గ్రౌండ్ పంప్‌హౌస్ పనుల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 16 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్ల ద్వారా కృష్ణా జలాలను పంపింగ్ చేసి మొత్తం 53 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు.

## కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు
- తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్
- మంత్రి కొండా సురేఖ ఎన్నోఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు.
- కుమార్తె వ్యాఖ్యలపై ఆమె వివరణ కోరాం.
- నిన్ననే షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.
- క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చాక ఏం చేయాలో ఆలోచిస్తాం.
- పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలపై ఆయనతో మాట్లాడాం.
- పోచారం ఆవేదనను అర్థం చేసుకున్నాం.
- ఎవరికి టికెట్ ఇవ్వాలో ఎన్నికల కమిటీ, సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంటుంది.




## మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీపై కేసు నమోదు



హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు నమోదైంది. సుమంత్ తనను బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశారని ఓ వ్యాపారి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వనందుకు తనపై దాడి చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మొదట మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పీఎస్‌కు బదిలీ చేశారు.

## సమన్వయం, డిజిటల్ వేదికలతో బాధితులకు సత్వర న్యాయం



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** నూతన క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం (బీఎస్ఏ) అమలులో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగంతో పాటు వివిధ విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "న్యూ క్రిమినల్ లాస్: స్ట్రెంగ్తెనింగ్ ద క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ త్రూ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్" అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చొరవతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయాధికారులు, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అధికారులు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు.




## ప్రకృతి వైద్యునిగా సుగుణారావుకు సర్టిఫికెట్

**కొత్తగూడెం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి)**
: కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ ఆల్టర్నేటివ్ థెరపిస్ట్ జి. సుగుణారావు ప్రకృతి వైద్యునిగా గుర్తింపు పొందారు. గత మూడు సంవత్సరాలుగా ఎన్‌డీడీవై వైద్య విద్యను పూర్తి చేసిన ఆయనకు గాంధీ నేషనల్ అకాడమీ ఆఫ్ నేచరోపతి (న్యూఢిల్లీ) సర్టిఫికెట్ అందించింది. గుంటూరు పట్టాభిపురంలోని టెంపుల్ ఆఫ్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా. ఎస్.కె. హుస్సేన్ చేతుల మీదుగా సుగుణారావు సర్టిఫికెట్ స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెంకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. బత్తుల కృష్ణయ్య, హైదరాబాద్‌కు చెందిన డా. తూమాట్ల వెంకన్న కూడా సర్టిఫికెట్లు అందుకున్నారు. సుగుణారావును పలువురు ప్రముఖులు, ప్రకృతి వైద్య రంగానికి చెందినవారు అభినందించారు.

## లంబాడీల మనోభావాలు దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**-- జిల్లా ఎస్పీకి లంబాడి హక్కుల పోరాట సమితి ఫిర్యాదు**



**కొత్తగూడెం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
లంబాడీల మనోభావాలు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, వారి సంస్కృతి, పండుగలు, ఆధ్యాత్మిక గురువులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు బుధవారం ఫిర్యాదు అందజేశారు. మితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది రమేష్ నాయక్ బాణోత్ మాట్లాడుతూ.. ఈ నెల 9న కొత్తగూడెం ప్రకాశం మైదానంలో జరిగిన ఆదివాసీ దినోత్సవ సాంస్కృతిక సభలో కొందరు లంబాడీల సంస్కృతి, పండుగలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అలాగే హథీరాం బావాజీపై కూడా అవహేళనగా మాట్లాడటం తమ మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు గిరిజన ప్రాంతాల్లో సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉన్నందున, సంబంధిత వ్యక్తులపై విచారణ జరిపి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు భూక్య మంగీలాల్ నాయక్, జిల్లా ప్రెసిడెంట్ మోహన్ నాయక్, ఉపాధ్యక్షులు బోడ కృష్ణ నాయక్, కార్యదర్శి నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## హైకోర్టు తీర్పుతో రాజకీయ కుట్రలకు చెక్

**రేగా కాంతారావుకు అనుకూలంగా తీర్పుపై బీఆర్ఎస్ శ్రేణుల హర్షం**



**కొత్తగూడెం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి)**
బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుపై నమోదైన కేసులో హైకోర్టు క్వాష్ పిటిషన్‌ను అనుమతిస్తూ అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. గురువారం కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రేగా కాంతారావు రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొందరు రాజకీయ కుట్రలో భాగంగా అక్రమ కేసు నమోదు చేయించారని ఆరోపించారు. గిరిజన నాయకుడిగా ప్రజల్లో ఆదరణ పొందుతున్న ఆయనను అడ్డుకునేందుకు తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. "పద్మవ్యూహాన్ని ఛేదించిన అర్జునుడిలా రేగా కాంతారావు న్యాయపోరాటం చేశారు. హైకోర్టు తీర్పుతో నిజం వెలుగులోకి వచ్చిందని నాయకులు అన్నారు. న్యాయం గెలిచిందని, రాజకీయ కుట్రలు, తప్పుడు ఆరోపణలు సత్యాన్ని ఎన్నాళ్లూ దాచలేవని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత బలపరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు సంకుబాపన అనుదీప్, కొట్టి వెంకటేశ్వరరావు, మంతపురి రాజు గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, ముత్యాల రాజేష్, సింధు తపస్వి, సర్పంచ్ రతన్ నాయక్, రంగరాజు రాజేష్, సురేష్, అన్వర్, మోహన్, మాదాసు పద్మ, డి.కొండ సునీత, మందుల జయరాజు, చల్తి రవి, గుమ్మడి సాగర్, రామంజి శ్రీనివాస్, షమ్మీ, వరప్రసాద్, రాధాకృష్ణ, మున్నా, సలిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నిజాంసాగర్ : రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, ఎత్తిపోతల పథకాలు వర్షాధారంగానే రైతులకు సాగునీటిని అందిస్తున్నాయని ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రాజెక్టులోని నీటి నిల్వలు వరద ప్రవాహిన్ని పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ డీఈ ప్రవీణ్ ను అడిగి ప్రాజెక్టు పరిస్థితి నీటి నిల్వలు,ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుల్గోస్తు వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ ఎల్‌నినో ప్రభావంతో జూన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదన్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 36 శాతం లోటు నమోదైందని తెలిపారు. జూలైలో వర్షాలు కురవడంతో పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చిందని, ఆరుతడి, మెట్ట పంటలకు కొంత ఊరట లభించిందన్నారు. అయితే శ్రీరాంసాగర్, జూరాల, కడెం, నాగార్జునసాగర్, దేవాదుల తదితర ప్రాజెక్టుల్లో తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో ఆయా ప్రాజెక్టుల కింద రైతులు వరి సాగుపై ఆందోళనకు గురయ్యారని చెప్పారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రాజెక్టులోని నీటి నిల్వలు, వరద ప్రవాహాన్ని పరిశీలించారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద బాన్సువాడ నియోజకవర్గంలో సుమారు 29 వేల బోరుబావులు ఉన్నాయని, వాటి ఆధారంగా సుమారు 95 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. నిజాంసాగర్ ఆయకట్టు రైతులు సాధారణంగా జూన్‌లో వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో మే నెలలోనే నారుమళ్లు పోస్తారని చెప్పారు. మే 15 నుంచి వేసిన నారుమళ్లు జూన్ 15 తర్వాత ముదిరిపోయే అవకాశం ఉండటంతో బోర్ల ఆధారంగా రైతులు ముందుగానే నాట్లు వేసుకున్నారని వివరించారు. బాన్సువాడ నియోజకవర్గంలో దాదాపు 100 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని, బోధన్ నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న నిజాంసాగర్ ఆయకట్టు గ్రామాల్లోనూ రైతులు నాట్లు వేసుకున్నారని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఆయకట్టు పరిధిలోనూ రైతులు నారుమళ్లు పోసుకుని వరి సాగు చేపట్టారని చెప్పారు. బోర్లలో నీటి మట్టాలు తగ్గిన సమయంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పోచారం అన్నారు. ఆ సమయంలో ప్రాజెక్టులో సుమారు 6.5 టీఎంసీల నీటి నిల్వ ఉందని, అవసరాన్ని బట్టి మూడు లేదా నాలుగు విడతల్లో సాగునీటిని విడుదల చేయాలని తాను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి, రైతులకు అవసరమైన సమయంలో నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా

- **మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి**
- **రెండో విడతకు లబ్ధిదారుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**కరీంనగర్:ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవం తం చేసి,మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాల ను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించా రు.అర్హులైన పేద కుటుంబా లకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభు త్వ లక్ష్యమని,ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచిం చారు.గురువారం కలెక్టర్ చాంబర్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులు,ఎంపీడీ వోలు,సంబంధిత అధికారు లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష



నిర్వహిం చారు.జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న 407 మందికి ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు .వారికి వెంటనే ప్రొసీడింగ్‌లు అందించి, నిర్మాణ పనులు ప్రారంభిం చేలా చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదే శించారు.రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 1,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన ప్రతిపాదనల ను ఇందిరమ్మ కమిటీల ద్వారా వెంటనే పంపిం చాలని ఎంపీడీవోలను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో మున్సి పల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచిం చారు. అదేవిధంగా పైకప్పు మార్పిడి (రూఫ్ రీప్లేస్ మెంట్) కోసం ప్రతి నియోజ కవర్గం నుంచి 500 మంది లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.రూఫ్ రీప్లేస్‌మెంట్ కోసం ప్రభు త్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించను న్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిం చాలనే సంకల్పంతో ప్రభు త్వం ముందుకు సాగుతోంద ని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని అధికారు లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,గృహ నిర్మాణ శాఖ పీడీ గంగారం, ఎంపీడీ వోలు, గృహ నిర్మాణ శాఖ డీఈలు,ఏఈలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- **యువతకు ఓటు హక్కు ఇచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ :ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం**
- **కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం**
- **రాజీవ్ చౌక్‌లోని విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళులు**

**కరీంనగర్:ఆగస్టు 20 (తెలంగాణ వాణి)**
మాజీ ప్రధాని,ఆధునిక భారత నిర్మాత,భారతరత్న స్వర్గీ య రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కరీంనగర్ నగరం లో ఘనంగా జరిగాయి. కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రాజీవ్ చౌక్‌లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీం నగర్ డిసిసి అధ్యక్షుడు డా.మేడిపల్లి సత్యం పూల మాల వేసి ఘనంగా నివా ళు లర్పించారు.
?ఈ కార్యక్రమంలో కార్పొరే షన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు,మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలు వురు కాంగ్రెస్ ముఖ్య నేతలు



పాల్గొని రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకు న్నారు.
?నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం టిపిసిసి ఆదేశాల మేరకు రాజీవ్ గాంధీ స్ఫూర్తితో 18 ఏళ్లు నిండిన యువత కోసం ప్రత్యేక ఓటరు నమో దు కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన యువతకు డిసిసి అధ్యక్షు డు మేడిపల్లి సత్యం స్వయంగా నూతన ఓటరు నమోదు ఫారాలను (ఫారం-6) పూరించి అందజేశారు. యువతకు భాగస్వామ్యం కల్పించిన గొప్ప మేధావి ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే డా.మేడి పల్లి సత్యం లాడు తూ "దేశంలో ఐటీ,టెలిక మ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి,నేడు సామా న్యుడు కూడా కంప్యూట ర్,సెల్ ఫోన్ వాడేలా పునా ది వేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ"అని కొనియా డారు.పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు,జవహర్ నవోదయ విద్యాలయాల ద్వారా గ్రామీణ విద్యార్థుల కు నాణ్యమైన విద్యను అందించారని గుర్తుచేశారు.?61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయ స్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి చట్టసభల ఎన్నికల్లో యువతకు భాగ స్వామ్యం కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుం దని తెలిపారు.రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చడాని కి కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా నిరంతరం కృషి చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పురుమల్ల శ్రీనివాస్,రాచకొండ చక్రధర్ రావు,మడుపు మోహన్, వెన్న రాజ మల్లయ్య, పర్వత మల్లేశం,కాంతాల జగన్ రెడ్డి,మూల రవీందర్ రెడ్డి,ఇక్రమ్,ముస్తాక్ అహ్మద్,ముత్యం శంకర్ గౌడ్,మల్యాల సుజిత్ కుమార్,వెన్నం రజిత రెడ్డి, వంగల విద్యాసాగర్, మునిగంటి అనిల్ మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణు లు,కార్యకర్తలు పాల్గొ న్నారు.

## పాలకవీడుకు పెద్దపీట.. రూ.600 కోట్లతో జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పాలకవీడు మండలానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పాలకవీడు మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకవీడు మండల ప్రజలంటే తనకు ఎంతో ఇష్టమని, అందుకే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో మండలానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. రూ.600 కోట్లతో చేపట్టిన జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే మండలంలోని సుమారు 10 వేల ఎకరాల భూములు సాగులోకి వస్తాయని చెప్పారు. సాగు, తాగు నీటితో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గానికి రెండు విడతల్లో కలిపి 5 వేల ఇళ్లు మంజూరయ్యాయని ప్రతి బూత్‌కు 15 ఇళ్ల చొప్పున పారదర్శకంగా కేటాయిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్లు



అవసరం లేని ప్రాంతాల్లోని కోటాను అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మళ్లిస్తామని స్పష్టం చేశారు.

**రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు**
గుడుగుంట్లపాలెం నుంచి సింగారం మీదుగా ఎల్లాపురం స్టేజీ వరకు 8 కిలోమీటర్ల రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.18 కోట్లతో చేపట్టే పనుల్లో రెండు కిలోమీటర్లు సీసీ రోడ్డు, మిగిలిన ఆరు కిలోమీటర్లు డాంబర్ డబుల్ రోడ్డుగా నిర్మించనున్నట్లు తెలిపారు. పనులను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్లాపురం గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఇప్పటికే రూ.3.20 కోట్లతో సబ్‌స్టేషన్ పనులకు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పెండెం వెంకటరమణ, పంచాయతీరాజ్ ఈఈ వెంకటయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి, సర్పంచులు సుజాత, పెరుమాళ్ల సురేష్, తహసీల్దార్ వాజిద్ అలీ, ఎంపీడీఓ లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ నాగిని, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి మాలోత్ మోతిలాల్, బెల్లంకొండ నరసింహారావు, నాగిరెడ్డి, జితేందర్‌రెడ్డి, డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సీఏజీఎం నాగమల్లేశ్వరరావు, శశిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం యాదవ్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

**కొత్తగూడెం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి)**
అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణ యాదవ కమిటీ సమావేశం గురువారం బాబు క్యాంపులోని జీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. యాదవ పెద్దలు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సమావేశంలో పట్టణ యాదవ పెద్దల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా చిలక రవి కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులుగా అమడగాని ప్రకాష్ యాదవ్, బొబ్బల వెంకటేశ్వర్లు యాదవ్, రేఖా రాజశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కసరబోయిన రమేష్ యాదవ్, కార్యదర్శిగా బుద్ధి మధు యాదవ్ ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా జక్కుల విజయ్ కుమార్ యాదవ్, సహాయ కోశాధికారిగా ముద్దైతుల వేణుగోపాల్ యాదవ్ నియమితులయ్యారు. సలహాదారులుగా కంచెం నాగయ్య యాదవ్, కసరబోయిన అయిలయ్య యాదవ్, సందెబోయిన శ్రీనివాస్ యాదవ్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సూరం అయిలయ్య యాదవ్, ఉడత శివకుమార్ యాదవ్, జక్కుల గట్టయ్య యాదవ్, బచ్చలకూర రఘు యాదవ్ ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను



పలువురు యాదవ సంఘం నాయకులు అభినందించారు. యాదవుల ఐక్యతను బలోపేతం చేస్తూ, సంఘం సంక్షేమం, అభివృద్ధి కోసం నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్‌తో పాటు పట్టణ యాదవ పెద్దలు, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## రైల్వే అభివృద్ధి పనులపై ఎంపీలతో ఎస్‌సీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) పరిధిలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ప్రయాణికుల సదుపాయాలు, అభివృద్ధి పనులపై సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో గురువారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ఎంపీలతో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు 15 మంది పార్లమెంట్ సభ్యులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, అదనపు జీఎం సత్య ప్రకాష్, వివిధ విభాగాల అధిపతులు, డీఆర్‌ఎంలు హాజరయ్యారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మండడి అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డిలతో పాటు లోక్‌సభ సభ్యులు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, కుందూరు రఘువీర్, ఆర్.రఘురాంరెడ్డి, సురేష్ కుమార్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, జి.నగేష్, డీకే అరుణ, బస్తిపాటి నాగరాజు, కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం సంజయ్



కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. జూన్ 2026 నుంచి ఎస్‌సీఆర్ పరిధి సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ మూడు డివిజన్లుగా పునర్వ్యవస్థీకరించినప్పటికీ గత రికార్డులను అధిగమిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటున్నట్లు తెలిపారు.
తెలంగాణలో రూ.2,000 కోట్లకు పైగా వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరిస్తున్నామని, ఇప్పటికే హైటెక్ సిటీ, బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు ప్రారంభం కాగా మిగిలిన పనులు శరవేగంగా సాగుతున్నాయని వివరించారు. రాష్ట్రంలో రూ.24,210.179 కోట్ల అంచనా వ్యయంతో 1,481 కి.మీ మేర కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 2025 నుంచి 4 జతల కొత్త రైళ్లు, 5 జతల అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించామని, 14 రైళ్లను పొడిగించడంతో పాటు 56 రైళ్లకు అదనపు స్టాపేజీలు కల్పించి, 30 జతల రైళ్లను రెగ్యులరైజ్ చేసినట్లు వెల్లడించారు. తమ నియోజకవర్గాల్లోని రైల్వే సమస్యలు, ప్రజల డిమాండ్లను ఎంపీలు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొత్త రైల్వే లైన్లు, నూతన రైళ్ల ప్రారంభం, ప్రధాన స్టేషన్లలో హాల్ట్‌ల ఏర్పాటు, ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపీల సూచనలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, బోర్డు స్థాయి ఆమోదం కోసం తగిన ప్రతిపాదనలు పంపుతామని జీఎం శ్రీవాస్తవ హామీ ఇచ్చారు.

## గురువుపై ఇంతటి ఘాతుకమా?

### ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యపై సామాజిక కార్యకర్త శశిధర్ రెడ్డి ఆవేదన



**వీణవంక, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డిపై జరిగిన హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సామాజిక కార్యకర్త ఎలుక శశిధర్ రెడ్డి అన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువునే హతమార్చడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు వారి ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై దృష్టి పెట్టాలని సూచించారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో నైతిక విలువలు, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయ సామర్థ్యం వంటి అంశాలతో కూడిన లైఫ్ స్కిల్స్ విద్యను తప్పనిసరి చేయాలని శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**శంకరంపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
పట్టణ అభివృద్ధిలో భాగంగా శంకరంపేటలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ



**కోరుట్ల రూరల్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ రంజిత్ రెడ్డి ఆట వస్తువులు పంపిణీ చేశారు. చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, పంచాయతీ కార్యదర్శి సల్మా సుల్తాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



**చౌటుప్పల్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో కంప్యూటర్ సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారని, 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య , వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్ ,కాసర్ల శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ తిగుళ్ళ చంద్రయ్య, కో ఆప్షన్ మెంబర్లు బాబా షరీఫ్, పస్తం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి చిన్నారెడ్డి నివాళి



**వనపర్తి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి బ్యూరో):**
మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి వనపర్తి పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ పునాది వేశారని, కంప్యూటర్, టెలికాం రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను రాజకీయాల్లో భాగస్వాములను చేశారని తెలిపారు. దేశ సమైక్యత, మత సామరస్యం కోసం కృషి చేసిన మహానేతగా రాజీవ్ గాంధీ చిరస్మరణీయులని కొనియాడారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని, గడిపిన జ్ఞాపకాలను చిన్నారెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు కమార్ మియా, అక్తర్ వనపర్తి పట్టణ మైనార్టీ అనీష్, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, గోపాల్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరహరి, వనపర్తి మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నారాయణ, వనపర్తి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, సహదేవుడు, సుధాకర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, మన్యం యాదవ్ , ద్వారపోగు విజయ్ బాబు, గోవర్ధన్ రెడ్డి, ఆసిఫ్, బాలచందర్, రఘు, ఇర్ఫాన్, శివ, కురుమయ్య, చెన్నయ్య, బషీర్ , వెంకటయ్య, పార్టీ అభిమానం తదితరులు పాల్గొన్నారు.

## జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలి - ఎస్ఎఫ్ఐ



**వేములవాడ,ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే శక్తి పథకాన్ని రద్దు చేసి, జీవో నంబర్ 97ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ర్యాలీగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి జీవో నంబర్ 97కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీకి అప్పగించవద్దని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఐటీఐ, ఏటీసీలతో కలిసి డిప్లొమా కోర్సులను అనుసంధానం చేసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి పథకాన్ని రద్దు చేయాలని, జీవో నంబర్ 97ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన లాటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయవద్దని డిమాండ్ చేశారు.

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**నకిరేకల్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
నకిరేకల్‌లో మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిరవోలు ఉపేందర్ రెడ్డి, దాసరి రామచంద్రయ్య, జనగోని రాజశేఖర్, ప్రమోద్, నర్సింగ్ మహేష్, పందిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎంఈఓకు ఘన సన్మానం

**చిలుకూరు, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
చిలుకూరు నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎన్జీ శివకుమారిని మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ ఐడీలు, విద్యార్థుల ప్రోగ్రెస్ మార్కులను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేసి చిలుకూరు మండలాన్ని జిల్లాలో ముందంజలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

## కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి



**హనుమకొండ, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట కీలక రైల్వే జంక్షన్‌గా ఉన్నప్పటికీ తగిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేస్తే రైల్వే పరిపాలన, మౌలిక వసతులు, ప్రయాణికుల సౌకర్యాలు, సరుకు రవాణా మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుపై సానుకూలంగా పరిశీలించాలని రైల్వే జీఎంను కోరారు.

## చిలుకూరులో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి





**చిలుకూరు, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
కోదాడ--జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరు మండల కేంద్రంలో బస్టాండ్ లేక విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పుట్టపాక దశరథ్ యాదవ్ తెలిపారు. బస్సుల కోసం రోడ్డుపక్కన వేచి ఉండాల్సి రావడంతో ఎండ, వర్షాల్లో అవస్థలు పడుతున్నారని అన్నారు. బస్సులు రోడ్డుపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్, ప్రమాదాల ముప్పు ఉందని పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే బస్ షెల్టర్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## వరంగల్ మహానగరమే.. రహదారులు మాత్రం నరకం



**హసన్‌పర్తి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గ్రేటర్ వరంగల్‌లో విలీనమైన గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 65వ డివిజన్‌లోని కోమటిపల్లి, నీరుప్‌నగర్ కాలనీల్లో గుంతలమయమైన మట్టి రోడ్లతో రైతులు, విద్యార్థులు, బస్సులు అవస్థలు పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి రహదారులను అభివృద్ధి చేయాలని వారు కోరారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యపై నిరసన



**వనపర్తి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి హత్యను ఖండిస్తూ వనపర్తి రాజీవ్ చౌక్‌లో ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు గురువారం నిరసన చేపట్టారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రూపారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## చిట్టెంపహాడ్ పాఠశాలకు అదనపు ఉపాధ్యాయుడిని కేటాయించాలి



**నాంపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చిట్టెంపహాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయురాలు మాత్రమే ఉండటంతో నాణ్యమైన విద్య అందడం లేదని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ తెలిపారు. ఐదు తరగతులకు అదనపు ఉపాధ్యాయుడిని వెంటనే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించకపోతే తల్లిదండ్రులతో కలిసి బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## దళిత మహిళలకు ఆర్థిక చేయూత అందించాలి



**భూపాలపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దళిత మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పొన్నగంటి లావణ్య డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి కోసం తక్కువ వడ్డీ రుణాలు, సబ్సిడీలు, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కుట్టు కేంద్రాలు, చిన్న వ్యాపారాలు, పశుపోషణ, ఆహార ప్రాసెసింగ్, హస్తకళలు వంటి రంగాల్లో శిక్షణతో పాటు పెట్టుబడి, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని ఆమె అన్నారు.



## రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**నిర్మల్--భైంసా, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జీ.విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విట్టల్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ, సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ ఫరూక్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ ఉత్తం భలే రావు, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇస్లాంపూర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్



**ఆదిలాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ఇచ్చోడ మండలం ఇస్లాంపూర్‌లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 150 మంది పోలీసులతో తెల్లవారుజామున ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 110 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, నాలుగు కార్లు స్వాధీనం చేసుకోగా, ఫేక్ నంబర్ ప్లేట్లు ఉన్న 15 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేశారు. గంజాయి, అక్రమ కార్యకలాపాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. కాలనీల్లో సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనదారులు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సిఐలు సిహెచ్ రమేష్, కె నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి వెంకటి, టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## మల్లుపేట్‌లో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఎల్లారెడ్డి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
సదాశివనగర్ మండలం మల్లుపేట్ గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రారంభించారు. రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం, రూ.10 లక్షల సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12 పడగల వెంకటేశ్వర స్వామికి విశేష అభిషేకం





**రాజపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
రాజపేట మండలం పాముకుంట గ్రామంలోని 12 పడగల శ్రీదేవి భూదేవి సమేత ఉత్తర ద్వార వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు తిరుణారి నరేష్ ఆధ్వర్యంలో నారాయణ సూక్త, పురుష సూక్త విధానంతో పంచామృత, ఫలోదక అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేక కార్యక్రమంలో హైదరాబాద్ నుండి డాక్టర్ సుధీర్ డాక్టర్ విశ్వంత్ స్వామివారికి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు నిత్య కైంకర్య పూజ సామాన్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తిరునారి వెంకటేష్ పంతులు పెంట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గోపాల గోపి మృతి సీపీఐ, ఏఐటీయూసీకి తీరని లోటు



**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూపాలపల్లి కేటీకే–1 గనిలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన గోపాల గోపి మృతి సీపీఐ, ఏఐటీయూసీకి తీరని లోటని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్ అన్నారు. కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. గోపాల గోపి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. విధి నిర్వహణలో మృతి చెందిన గోపాల గోపి కుటుంబానికి సింగరేణి యాజమాన్యం రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ బ్రాంచి, జిల్లా నాయకులు నూకల చంద్రమౌళి, ఎండి ఆసిఫ్ పాషా, తాళ్ల పోశం, నేరెళ్ల జోసెఫ్, హైమద్, జెండాల కొమురయ్య,బాబురావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ చరిత్ర--సంస్కృతి పుస్తకాల వితరణ



**వనపర్తి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో 'బంగారు తెలంగాణ--చరిత్ర, సంస్కృతి' పుస్తక వితరణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుస్తక రచయిత శ్రీ నారాయణ డీవీవీ 100 మంది విద్యార్థినులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, ఆలోచనా శక్తి పెంపొందుతాయని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ పి. చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ రామరాజు యాదవ్, డాక్టర్ పోతరాజు శ్రీనివాస్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా



**పెద్దపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అంతర్గాం మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడంతో పాటు టెలికాం, ఐటీ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, డీసీసీ ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్య గౌడ్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో కర్నె తండా లిఫ్ట్ పంపులు ప్రారంభించాలి



**వనపర్తి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గిరిజన రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపట్టిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఖిలా ఘనపూర్ మండలంలోని కర్నె తండా లిఫ్ట్‌ను ఆయన పరిశీలించారు. రూ.76.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకం ద్వారా 9 గిరిజన తండాలు, 6 గ్రామాలకు చెందిన సుమారు 4,500 ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో పనులు చేపట్టామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని, కేవలం సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు కాలయాపన చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం కృష్ణా నదిలో సమృద్ధిగా నీరు ఉన్నందున వెంటనే పంపులను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో పంపులు ప్రారంభించకపోతే వేలాది మంది రైతులతో కలిసి కర్నె తండా లిఫ్ట్‌ను ముట్టడించి పంపులు ప్రారంభించే వరకు ఆందోళన చేపడతామని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, రాళ్ల కృష్ణయ్య, సామ్యా నాయక్, జాత్రు నాయక్, పీన్యా నాయక్, గోపాల్ నాయక్, నరేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

## మైక్రాన్ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



**తెల్లాపూర్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు టి. భాస్కర్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మైక్రాన్ సాఫ్ట్‌వేర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగం, ఆధునిక సాంకేతికత, ఐటీ రంగంలోని కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి విద్యా సందర్శనలు విద్యార్థుల్లో టెక్నాలజీపై ఆసక్తిని పెంపొందిస్తాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

## బస్తీ బాటలో సమస్యలు పరిశీలించిన కె.ఎస్. రత్నం



**హైదరాబాద్/శేరిలింగంపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అంజయ్యనగర్, బంజారా బస్తీలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు, పొంగుతున్న డ్రైనేజీ, అధ్వాన రహదారుల సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రవికుమార్ యాదవ్, కె.ఎస్. రత్నం హామీ ఇచ్చారు.
అనంతరం రేషన్ షాపులను పరిశీలించి, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల వాటాలను ప్రజలకు తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రవి నాయక్.జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు సాగర్, సంతోష్ కుమార్ మన్యం కొండ సాగర్. సరోజరెడ్డి, ఆమనిసాగర్, వెంకటేష్, కిషన్,క్రాంతి, ధనరాజ్, మోహిత్. శంకర్,సంజీవ్ చందు, ఇతర స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కిషన్ గోలికి శుభాకాంక్షలు తెలిపిన గంగాధర్ రెడ్డి



**హైదరాబాద్/శేరిలింగంపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
నల్లగండ్ల డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కిషన్ గోలి గౌలిదొడ్డిలోని మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి కిషన్ గోలిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాలని గంగాధర్ రెడ్డి సూచించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హీరన్, సాయిరామ్, అంబన్, దేవేందర్, అరుణ్,మధు, శంకర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**వేములవాడ, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. విధులకు అవసరమైన భద్రతా పరికరాలు అందించడంతో పాటు పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందుల మల్లేశం, కార్మిక సంఘ నాయకులు రాజశేఖర్, గాజుల చంద్రయ్య, నాగరాజు, ప్రశాంత్, పిట్టల రాజశేఖర్, ముప్పిడి తిరుపతి, ఆల్వాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల చేతిలో ఉపాధ్యాయురాలి హత్య బాధాకరం: ఏబీవీపీ



**కొండమల్లేపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగార్జున గ్రామర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటనను ఏబీవీపీ తీవ్రంగా ఖండించింది. కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడారు. విద్యార్థుల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లు, మానసిక స్థితిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసులు నిఘా పెంచాలని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా ప్రభుత్వం, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి నూతన గంటి గణేష్, మేడమోని సంతోష్, కండెల బాలు, కుందూరు గోవింద్, షేక్ రహీం భాష, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## రూపారెడ్డి మృతికి సంతాపంగా క్యాండిల్ ర్యాలీ



**హుజురాబాద్: ఆగస్ట్20, (తెలంగాణ వాణి)**
విద్యార్థుల చేతిలో అమానుషంగా హత్యకు గురైన ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతికి సంతాపంగా, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గురువారం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రస్మా ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ఉపాధ్యాయులు కొవ్వొత్తులు చేతబూని ర్యాలీ నిర్వహించి రూపారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వకుళభరణం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పారెడ్డి రవీందర్‌రెడ్డి, కోశాధికారి కోటేశ్వర్, కరస్పాండెంట్ ఎం.నారాయణరెడ్డి, మాడిశెట్టి ప్రసాద్, కిరణ్, బి.రాజ్‌కుమార్, వేణుమాధవ్, షాజు థామస్, పి.సతీష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీజేవైఎం స్టూడెంట్ మార్చ్

**కరీంనగర్ టౌన్ ,ఆగస్టు 20, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రాష్ట్రంలో పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులు కదం తొక్కారు. తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు వందలాది మంది కళాశాల విద్యార్థులతో భారీ "స్టూడెంట్ మార్చ్" నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు చెల్లించాల్సిన సుమారు రూ. 12,000 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడు తోందని ధ్వజమెత్తారు. బకాయిలు అందక కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు నిలిపివేయడంతో లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వం ఇస్తున్న భిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు.అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆందోళనలను అడ్డుకునేందుకు





పోలీసులు నోటీసులతో బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. బకాయిలు చెల్లించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ,రాష్ట్ర అధికార ప్రతినిధి,డిప్యూటీ మేయర్ యాదగిరి సునిల్ రావు,బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు, కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బొయినిపల్లి ప్రవీణ్ రావు, జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు, బిజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి, బిజేవైయం జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్, బిజేవైయం నాయకులు ఎడవెల్లి శశిధర్ రెడ్డి,చిక్కుల కిరణ్,నక్క ప్రమోద్, గుర్రం వెంకటేష్ గౌడ్, రమేష్ యాదవ్, వెంకటసాయి, బద్దం రాహుల్ రెడ్డి,వినయ్, మణిదీప్, నాగరాజు, సందీప్, శ్రీకర్, రాజేందర్, సతీష్ బిజేవైయం నాయకులు, కార్పోరేటర్లు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు బిజెపి జిల్లా నాయకులు,మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పరిరక్షణతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు



**వేములవాడ, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భూగర్భ జలాల పరిరక్షణతోనే భావితరాలకు నీటి కొరత లేని భవిష్యత్తు అందించగలమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవాడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నమూనా ఇంకుడు గుంత నిర్మాణానికి ఆయన వైస్ చైర్మన్, కమిషనర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ప్రతి ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## జానపద పరిరక్షణకు కళాకారుల ఐక్యతే బలం



**వేములవాడ, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జానపద కళల పరిరక్షణకు కళాకారుల ఐక్యతే ప్రధాన బలమని అరుణోదయ విమలక్క అన్నారు. వేములవాడలో ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ (ఐటీఎఫ్) ఆధ్వర్యంలో కళాకారులకు సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత కళాకారులపై ఉందన్నారు. కళాకారుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీఎఫ్ ఫౌండర్ సభ్యులు మారం ప్రవీణ్‌కుమార్, బుర్ర నట్రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం పటేల్స్ అధ్యక్షుడు కొండ దేవయ్య, స్థానిక నాయకులు ఇప్పపుల అజయ్, మారం కుమార్‌తో పాటు పలువురు కళాకారులు, ఐటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల బోనస్..ఆన్‌లైన్ నమోదుకు సెప్టెంబర్ 10 గడువు

**తిమ్మాపూర్ ,ఆగస్టు 20, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 7 రకాల సన్న వరి సాగు చేస్తున్న రైతులు క్వింటాల్‌కు రూ.500 బోనస్ పొందాలంటే ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి అని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.ప్రైవేట్ డీలర్లు లేదా సొసైటీల్లో విత్తనాలు కొన్న రైతులు అక్కడి నిర్వాహకుల ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలి.స్వంత విత్తనాలు, సీడ్ ప్లాంట్లు, యూనివర్సిటీలు లేదా పరిశోధనా సంస్థల నుంచి విత్తనాలు తెచ్చుకున్నవారు సంబంధిత ఏఈఓను కలిసి దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబర్ 10, 2026 వరకు ఆన్‌లైన్ నమోదుకు తుది గడువుగా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో సాగు వివరాలు నమోదు చేసుకున్న రైతులు మాత్రమే బోనస్‌కు అర్హులని వ్యవసాయ శాఖ పేర్కొంది.

## లయన్స్ క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరం



**వేములవాడ, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చక్రవర్తి ఐ కేర్ ఆసుపత్రి సహకారంతో జరిగిన శిబిరంలో విద్యార్థులు, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి వైద్యులు అవసరమైన సూచనలు అందించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బచ్చు వంశీకృష్ణ, కొమ్మ నటరాజ్, డాక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపై దాడి.. కొడుకు ఆత్మహత్య

**మానకొండూర్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామంలో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. వద్దూరి శ్రావణ్‌కుమార్ (33) తన తల్లి దుర్గమ్మపై కత్తితో దాడి చేయగా ఆమె తీవ్రంగా గాయపడింది. అనంతరం శ్రావణ్ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన దుర్గమ్మను స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సమస్యలతో శ్రావణ్ మానసిక ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. తండ్రి నరసయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ శ్రీలత ఘటన స్థలాన్ని పరిశీలించారు.

## గ్రామ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌తో సర్పంచ్ రవి నాయక్

### డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి.



**పెద్దపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి.టి.ఎస్. అంతర్గాం గ్రామ అభివృద్ధి, మౌలిక వసతులపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌ను సర్పంచ్ అంగోతు రవి నాయక్ కలిసి చర్చించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, అంతర్గత రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి చేశారు. గ్రామ ప్రజల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, అవసరమైన నిధులు సమకూర్చి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ రవి నాయక్ తెలిపారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**డిండి ఆగస్టు 20 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**

డిండి మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాసంక్షేమానికి దేశ ప్రగతికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వృద్ధులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతి నేని వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు ముత్యాల శశిధర్ రెడ్డి, యువజన సంఘం అధ్యక్షులు గడ్డమీద సాయి, సలయ్య, శ్రీనివాస్ గౌడ, బాలయ్య, చంద్రయ్య కలీం, లక్ష్మణ్,కృష్ణ, సైదులు,ప్రవీణ్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కోరుట్లలో తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం





**కోరుట్ల రూరల్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

కోరుట్ల కాలేజ్ గ్రౌండ్‌లో 12వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ సౌత్ జోన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వివిధ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా అధికారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

### మంత్రి లక్ష్మణ్ కుమార్



**ధర్మారం--జూలపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జూలపల్లి మండలం అబ్బాపూర్‌లో పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో కలిసి నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, నూతన పెన్షన్లు అర్హులకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అబ్బాపూర్--పెరికపల్లె రోడ్డు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండే వెంకటేష్, జగిత్యాల జిల్లా గంథ్రాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, పీఏసీఎస్ చైర్మన్లు లోక జలపతి రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**పెద్ద శంకరం పేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

పెద్ద శంకరం పేట మండల కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో భాగస్వాములను చేసిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,స్థానిక ప్రజాప్రతినిధులు,మండల స్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ బాధ్యులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకాన్ని పరిశీలించిన కలెక్టర్



**మెదక్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

హవేలీ ఘన్‌పూర్ మండలం బోగడ భూపతిపూర్‌లో రైతు జైపాల్‌రెడ్డి పొలంలో తేనెటీగల పెంపకాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ గురువారం పరిశీలించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 10 మంది రైతులకు 104 తేనెటీగల పెంపకం బాక్సులను 40 శాతం సబ్సిడీతో అందించినట్లు తెలిపారు. తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం, ఉపాధి పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో ఇండియన్ బ్యాంక్ కస్టమర్ అవగాహన కార్యక్రమం




**జమ్మికుంట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

జమ్మికుంట ఇండియన్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు, సైబర్ నేరాల నివారణ, ఖాతాల భద్రత, ఏటీఎం వినియోగం, రుణాలు, గోల్డ్ లోన్లపై అవగాహన కల్పించారు. ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, సీవీవీ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని బ్యాంకు అధికారులు సూచించారు. అనుమానాస్పద లింకులు, కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రుణాలు తీసుకునే ముందు వడ్డీ, ఛార్జీలు, చెల్లింపు నిబంధనలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ హరినాథ్ ఆధ్వర్యం వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, గణేష్, శ్రీకాంత్, హర్షతో పాటు పలువురు బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు

## ఏసీబీ వలలో అవినీతి అధికారి

### రూ.20 వేల లంచం తీసుకుంటూ మొలంగూర్ జీపీఓ అరెస్ట్



**శంకరపట్నం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామ జీపీఓ కంపేటి శ్రీనివాస్ రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫీల్డ్ రిపోర్టు, పాస్‌బుక్ జారీ కోసం జీపీఓ మొదట రూ.15 వేలు, అనంతరం మరో రూ.5 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయి ంచగా, అధికారులు పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించారు. గురువారం రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని, రసాయన పరీక్షలు నిర్వహించగా ఆయన ఎడమ చేతి వేళ్లు, ప్యాంటు జేబుకు పాజిటివ్‌గా తేలినట్లు ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి తెలిపారు. నిందితుడిని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు, కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ అధికారి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ 9440446106కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

## ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ



**నీలం మధు ముదిరాజ్**

**పటాన్‌చెరు, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

చిట్కుల్‌లో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలికాం, కంప్యూటర్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన ఘనత రాజీవ్ గాంధీదేనని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణల ఫలితంగానే దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**రాజపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

రాజపేట మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పీఏసీఎస్ చైర్మన్ నమిలే మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత రాజీవ్ గాంధీ అని, టెలికాం, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయ మన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బుడిగే పెంటయ్య గౌడ్ ఉప సర్పంచ్ కేదారి గౌడ్ జిల్లా కార్యదర్శి జయ రాములు ఐరేణి నవీన్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లెన స్వామి యూత్ అధ్యక్షుడు గుర్రం రూపేష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షునిగా బొద్దుల బాల్ నరసయ్య,

**రాజపేట ఆగస్టు 20:(తెలంగాణ వాణి విలేకరి)**

మండలంలోని రేణికుంట గ్రామంలో పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా బొద్దుల బాల్ నరసయ్య నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తుందని, చేనేత కార్మికుల సమస్యలు మరియు ప్రభుత్వం నుండి అందవలసిన సంక్షేమ పథకాలు ప్రతి చేనేత కార్మికుడికి అందే విధంగా నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గౌరవ అధ్యక్షునిగా బొద్దుల బిక్షపతి, ఉపాధ్యక్షుడిగా భోగ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎర్రగుంట బాలరాజు, సహాయ కార్యదర్శిగా కొంగరి శ్రీహరి, కోశాధికారిగా కొండ అశోక్, కార్యవర్గ సభ్యులుగా బొమ్మ జనార్ధన్, బొద్దుల ఆదినారాయణ, వడ్లకొండ చంద్రశేఖర్, బిట్ల ఆంజనేయులు, కొండ భాస్కర్ ను ఎన్నుకోవడం ఎన్నుకున్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ

**కోరుట్ల రూరల్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి)**

ధర్మారం ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ రంజిత్‌రెడ్డి ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనేలా ప్రోత్స హించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, పంచాయతి కార్యదర్శి సల్మా సుల్తాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 120 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ




**ధర్మారం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో 120 మంది విద్యార్థులకు దాతల సహకారంతో రూ.54 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్సులను సర్పంచ్ మాందాల శ్రావణి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సరిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు సహకరించిన వర్ష జ్యూవెల్లరీ యజమాని యాద వీరేశ్, వార్డు సభ్యుడు జోగుల కొమురయ్య--లక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పూసాల మల్లేషం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సరిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ ఏలేటి పద్మలచ్చిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు గంధ్రాతి శ్రీలత, అనుమల్ల శారద, సిరిపురం సునిల్, అరుణశ్రీ, సౌజన్య, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్, వార్డు సభ్యులు రెచవేణి మహేష్, నాయకులు మాందాల హరీష్, ఎన్నంపల్లి మునిందర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## సర్కారు బడికి వాటర్ ప్యూరిఫైయర్ బహూకరణ



**ధర్మారం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**

తన స్వగ్రామంపై మమకారంతో ఎన్నారై కొలుముల దామోదర్ యాదవ్ రూ.30 వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను కొత్తూరు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు కొలు ముల ఫౌండేషన్ తరఫున అందించారు. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కొలుముల పెద్ద గంగన్న ప్యూరిఫైయర్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ప్యూరిఫైయర్ అందించడం అభినంద నీయమని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. దామోదర్ యాదవ్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బత్తిని సరిత, ఉపాధ్యాయులు, కొలుముల ఫౌండేషన్ గ్రామ అధ్యక్షులు పులకొల్ల లింగమూర్తి, వార్డు సభ్యులు కోడూరి నాగజ్యోతి కనకయ్య, పాఠశాల సీఆర్పీ బట్టు కుమారస్వామి, అంగన్వాడీ టీచర్ తాళ్ళ విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన



**మెదక్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

హవేలీ ఘన్‌పూర్ మండలం తోగిట గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే మెదక్, రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూఎన్‌డీపీ బయోఫిన్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు జీవ ఎరువులు పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎం. శ్రీనివాస్, ఎం. శ్రీకాంత్ సమగ్ర పురుగుల, పోషక యాజమాన్యం, జీవ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. జీవ ఎరువులతో భూసారం, పంటల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 50 మంది రైతులు, ఎఫ్ పి ఓ చైర్మన్ యన్ శ్యామ్ సుందర్,సర్పంచ్ సౌమ్య శశికాంత్ , మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డా. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం, తునికి, మెదక్ వారు యు ఎన్ డి పి బయోఫిన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు

## ఓటు హక్కు విలువను చిన్ననాటి నుంచే నేర్పిస్తున్న గీతా స్కూల్

### పాఠశాల లీడర్ ఎన్నికలతో విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన



**పటాన్‌చెరు, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
శాంతినగర్‌లోని గీతా స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థుల స్కూల్ లీడర్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎక్స్అఫీషియో మెంబర్ మాద్రి పృథ్వీరాజ్ హాజరై ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకుడిని ఎలా ఎన్నుకోవాలి, ఓటు ఎందుకు వేయాలి, ఓటుతో ఎలాంటి మార్పు తీసుకు రావచ్చనే విషయాలను చిన్ననాటి నుంచే విద్యార్థులకు నేర్పించడం అభినందనీయమన్నారు. నాయకుడిని ఎన్నుకునేటప్పుడు నాయకత్వ లక్షణాలు, నిజాయితీ, బాధ్యత, సేవాభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఎన్నికైన విద్యార్థి తోటి విద్యార్థుల సమస్యలతో పాటు పాఠశాల అవసరాలపై బాధ్యతగా వ్యవహరించేలా అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్‌లో బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దే కార్యక్రమానికి గీతా స్కూల్ శ్రీకారం చుట్టిందని పృథ్వీరాజ్ అన్నారు. కార్యక్రమం పట్ల పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

## ఎన్నిమరేటర్స్‌కు డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించాలని తహసిల్దార్‌కు వినతి పత్రం



**రాజాపేట ఆగస్టు: 20(తెలంగాణ వాణి విలేఖరి)**
డ్యూటీ లో ఉన్న ఎన్నిమరేటర్స్ కు డ్యూటీ సర్టిఫికెట్స్ ఇవ్వాలని పి ఆర్ టి యు టి ఎస్ రాజపేట మండల శాఖ పక్షాన ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చారు. అదేవిధంగా ఎంఈఓ కు ఉపాధ్యాయులకు రావలసిన గ్రామ పంచాయతీ ఎలక్షన్ లో రావలసిన సీసీఎల్ఎస్ సెన్సెస్ డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు ఈ ఎల్ ఎస్ కు సంబంధించిన ప్రోసీడింగ్ తీయమని కోరుతూ పి ఆర్ టి యు టి ఎస్ రాజపేట పక్షాన రిప్రజంటేషన్ ఇవ్వనైనది. గ్రామంలోఅధ్యక్షులు గౌటె బాలరాజు,ప్రధాన కార్యదర్శి సంపతి సుబ్బరాజు వంశీధర్ ,కనకయ్య, బాలరాజు, శిరీష, సరిత, తదితరులు పాల్గొన్నారు

## రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేద్దాం

### కొమురవెల్లి మండల కాంగ్రెస్ నాయకుల పిలుపు



**కొమురవెల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, జాతీయ సమైక్యత కోసం కృషి చేసిన మహానేత అని కొనియాడారు. సద్భావనా దినోత్సవ స్ఫూర్తితో "సమైక్యతే మన శక్తి--సద్భావనే మన ప్రగతి" అనే ఆశయంతో రాజీవ్ గాంధీ చూపిన మార్గంలో పయనిస్తూ బలమైన భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీఎంపీఎస్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలి



**నర్సంపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర 4వ మహాసభలను ఈ నెల 22, 23, 24 తేదీల్లో చెంగిచెర్లలో నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ తెలిపారు. మహాసభలను గొల్లకురుమలు, గొర్రెల కాపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గొర్రెల కాపరులకు పింఛన్, ప్రమాద మృతులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, మేత భూములకు భూమి కేటాయింపు, గ్రామాల్లో పశువైద్యశాలల ఏర్పాటు, ఖాళీ వెటర్నరీ పోస్టుల భర్తీ తదితర డిమాండ్ల సాధనకు మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కుండ లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మల్లేష్, జక్క రవి, మండల అధ్యక్ష కార్యదర్శులు రాజులపాటి సూరయ్య, దాడి రాజు, మండల కోశాధికారి భూస రాజు, నాన్నబోయిన సుమన్, పొగాకు శీను, ఉపాధ్యక్షుడు పైడిపల్లి కొమురయ్య, కుండె రాజ్‌కుమార్,పైడిపెల్లి బాలరాజు, జున్ను సాంబరాజు, కొమ్మ శివ, కొమ్మ కిరణ్, కొమ్మ బాలకొమురయ్య, కొమ్మ పెద్దరాజు, కొమ్మ చంద్రమౌళి, కొమ్మ లింగన్న, కొమ్మ కుమారస్వామి, అమ్మ భద్రయ్య, పైడిపల్లి సమ్మయ్య, ఎగ్గడి ఐలయ్య, బొల్ల మల్లయ్య, ఆర్. మహేందర్, బి. సదానందం, బి. ప్రభాకర్, బి. శ్రీకాంత్, కే. రవి, లింగయ్య, రమేష్, రవి, డి. కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు

# మౌలిక వసతులు కల్పనకు పెద్ద పీఠ

### పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



పెద్ద శంకరం పేట, ఆగస్టు 20, (తెలంగాణ వాణి): గ్రామాలు, మండల కేంద్రాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. పెద్ద శంకరం పేట మండల కేంద్ర పరిధిలో పలు వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి గ్రామం, మండల కేంద్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పటిష్టం చేస్తున్నాం అని అన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకే అత్యంత ప్రాధాన్యతతో డ్రైనేజీ పనులను ప్రారంభించాం. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువు లోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శవ రాజకీయాలు మానుకోవాలి: పెండెం రామానంద్



**నర్సంపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బీఆర్ఎస్ నాయకులు శవ రాజకీయాలు, అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ హితవు పలికారు. నర్సంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అనుమతులు లేకుండా అసైన్డ్ భూమిలో విగ్రహం ఏర్పాటు చేయడంతోనే అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. అన్ని అనుమతులతో విగ్రహం ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ తరఫున సహకరిస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చింతల సాంబ రెడ్డి, పంబి వంశీ, సందీప్, మురళి .తదితరులు పాల్గొన్నారు

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించింది కేసీఆరే: కౌశిక్‌రెడ్డి



**కమలాపూర్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ చేపట్టినదేనని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినట్లుగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ఇళ్లలో మిగిలిన మౌలిక వసతుల పనులను పూర్తి చేసి, అర్హులైన నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పేరుతో కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో మరోసారి కమలాపూర్‌కు వస్తానని, అప్పటిలోగా అన్ని వసతులు కల్పించి ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పేరాల సంపత్‌రావు, తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, మారెపల్లి నవీన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కౌడగాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై "ఓపెన్ బాక్స్"

**-రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి**



**మంచిర్యాల, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
చెన్నూర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా ప్రతి ఒక్కరి సమస్య తన దృష్టికి వచ్చేలా 'ఓపెన్ బాక్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు లేదా తనపై ఉన్న ఫిర్యాదులను సైతం స్వేచ్ఛగా లేఖ రూపంలో రాసి ఓపెన్ బాక్స్‌లో వేయవచ్చని ఆయన సూచించారు. బాక్స్ తాళం తన వద్దే ఉంటుందని, తానే స్వయంగా బాక్స్‌ను తెరిచి లేఖలను పరిశీలిస్తానని చెప్పారు. సమస్యల తీవ్రత, వాస్తవ పరిస్థితులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుని స్పందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

## భూముల సర్వే పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలో భూముల సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇప్పటివరకు పూర్తయిన, మిగిలిన సర్వే వివరాలను తెలుసుకున్నారు. ఆధునిక పరికరాలతో సర్వేను ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. అనంతరం సర్వే నిర్వహణ కోసం నూతన ల్యాప్‌టాప్‌లను అధికారులకు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాస్‌కు సన్మానం

**ఎల్లారెడ్డి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌ను మాజీ ఎంపీపీ, సీనియర్ నాయకుడు నక్క గంగాధర్, కూర బాలకిషన్ గురువారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో శ్రీనివాస్ సేవలు అభినందనీయమని నక్క గంగాధర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రాజంపేట ఎస్సై

**ఎల్లారెడ్డి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కేసు విషయంలో స్టేషన్ బెయిల్ ఇప్పిస్తానంటూ రూ.లక్ష లంచం డిమాండ్ చేసి, చివరకు రూ.50 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న రాజంపేట ఎస్సై ఆంజనేయులు ఏసీబీకి పట్టు బడ్డారు. ఇప్పటికే రూ.20 వేలు తీసుకున్న ఎస్సై, మిగతా రూ.30 వేలు తీసుకుంటుండగా బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు కామారెడ్డిలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.





## కొమురవెల్లిలో పంటల మార్పిడిపై రైతులకు అవగాహన

**కొమురవెల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కొమురవెల్లి రైతు వేదికలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ అధికారులు స్థానిక వాతావరణం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మార్కెట్ అవకాశాలు, సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి, మహదేవపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ (ూాఔ) పోస్టుల భర్తీకి మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.
నోటిఫికేషన్ నంబర్ ూా/1137/2026 ప్రకారం అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 2, 2026 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. దరఖాస్తులు కేవలం అధికారిక వెబ్‌సైట్ ఔఔణజఔ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్‌రి **(https://wdcw.tg.nic.in/?utm_sourceRchatgpt.com)** ద్వారానే స్వీకరించనున్నట్లు తెలిపారు. జణూా కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు.

**అర్హతలు:**
2026 జూలై 1 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండి, ఇంటర్మీడియట్/12వ తరగతి ఉత్తీర్ణులైన సంబంధిత గ్రామం లేదా వార్డుకు చెందిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఎంపిక విధానం:**
మొత్తం 100 మార్కులకు ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్‌కు 70 మార్కులు, జిల్లా కమిటీ ఇంటర్వ్యూకు 10 మార్కులు కేటాయించనున్నారు. వితంతువులు, అనాథలు, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం 5 నుంచి 10 మార్కుల ప్రత్యేక వెయిటేజీ ఉంటుందని అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**రామకృష్ణాపూర్,ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ఎన్‌హెచ్--363 జాతీయ రహదారిపై భారతనగర్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాసిపేట మండలం ధర్మారావుపేటకు చెందిన నూకల సంతోష్‌కుమార్ (22) మృతి చెందాడు. శ్రీరాంపూర్ నుంచి క్యాతన్‌పల్లి వైపు బైక్‌పై వెళ్తున్న సంతోష్‌కుమార్ అధిక వేగంతో, తప్పుదారిలో ప్రయాణిస్తూ ఎదురుగా వస్తున్న బొలెరో ట్రాలీని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో రెండు వాహనాలు మంటలకు గురై దగ్ధమ య్యాయి. తీవ్రంగా గాయపడిన సంతోష్‌కుమార్‌ను మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



**నిర్మల్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నిర్మల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. దేశ ప్రగతి, ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశ యాలు, ప్రజాసేవా స్ఫూర్తి అందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.

## చండీ హోమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్



**ఆదిలాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆదిలాబాద్ టైలర్స్ కాలనీలో తాంసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కౌదాల సంతోష్ స్వగృహంలో నిర్వహించిన చండీ హోమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ

### --కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల,ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
పోలీస్ శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు 90 రోజుల పాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లో శిక్షణకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు.ప్రిలిమ్స్, మెయిన్స్‌తో పాటు ఈవెంట్స్‌కు ప్రత్యేక శిక్షణ, ఉచిత స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. ఆగస్టు 20 నుంచి అన్ని పోలీస్‌స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరిస్తుండగా, 31న తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8712538278, 9490906773 నంబర్లకు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీసీపీ ఎ.భాస్కర్, ఏసీపీ ప్రకాష్, ఆర్ఐ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ల్వే అభివృద్ధిపై ఎంపీ వంశీకృష్ణ భేటీ



**మంచిర్యాల, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో రైల్వే సౌకర్యాల అభివృద్ధి, పెండింగ్ పనుల పూర్తి, ప్రయాణికుల సమస్యల పరిష్కారంపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టి సారించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎంతో జరిగిన సమావేశంలో నియోజకవర్గానికి అదనపు రైళ్లు, ముఖ్య రైళ్లకు స్టాపేజీలు, స్టేషన్లలో మౌలిక వసతుల మెరుగుదల తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రైల్వే కనెక్టివిటీని విస్తరించాలని కోరారు. సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు హామీ ఇచ్చారు.

## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



**రామకృష్ణాపూర్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక సరఫరాపై కలెక్టర్ పరిశీలన



**మంచిర్యాల, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ఎస్ఎస్ఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఇసుక సరఫరా ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం జైపూర్ మండలంలోని వేలాల ఇసుక రీచ్‌ను తహసిల్దార్ వనజ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు నిర్ణీత సమయంలో సరఫరా చేయాలని సూచించారు. అక్రమ రవాణా, నిల్వపై నిరంతరం నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారి 163జి నిర్మాణ పనులను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

## పటిష్టమైన పోలీసింగ్ వ్యవస్థ అమలు చేయాలి: ఎస్పీ అఖిల్ మహాజన్

**బోథ్, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బోథ్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. సిబ్బంది పరేడ్, కిట్ సామగ్రి, స్టేషన్ రికార్డులు, కేసు ఫైళ్లను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిరంతరం పర్యటిస్తూ గంజాయి, పేకాట, గుడుంబా వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని సూచించారు. ప్రజల సమస్యలను బాధ్యతగా స్వీకరించి, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందిస్తూ పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి



గురు స్వామి, ఎస్ఐ వి పురుషోత్తం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## సాయిప్రశాంత్ రాథోడ్‌కు జాతీయ మానవతా పురస్కారం



**టేకులపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి మండలం పాతతండాకు చెందిన భూక్య సాయిప్రశాంత్ రాథోడ్ సామాజిక, యువజన సేవలకు గుర్తింపుగా నేషనల్ హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డు--2026 అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్, మాజీ డీసీపీ లక్ష్మీ నారాయణ్ రావు చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. గ్రామీణ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలపై మార్గదర్శకత్వంతో పాటు స్వగ్రామంలో లైబ్రరీ ఏర్పాటుకు చేస్తున్న కృషికి ఈ పురస్కారం లభించింది. ఈ అవార్డుకు సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) స్పాన్సర్‌గా,కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్--ఎ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఎంటర్‌ప్రైజ్ అసోసియేట్ పార్ట్‌నర్‌గా,ఐ క్యాన్ ఫౌండేషన్ -- నర్చరింగ్ హ్యూమానిటీ ఆర్గనైజింగ్ పార్ట్‌నర్‌గా,హైప్‌ఎడ్జ్ మీడియా పార్ట్‌నర్‌గా సహకరించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలి

### 11 రకాల ధ్రువపత్రాలను నిబంధనల మేరకు పరిశీలించాలి: కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రఘునాథ పాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామంలో ఎస్ఐఆర్‌లో గుర్తించిన నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసుల జారీ, ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్, నోటీసుల జారీ రికార్డులు, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకుని ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, నో మ్యాపింగ్, వివరాల్లో వ్యత్యాసాలను గుర్తించి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరయ్యేలా బీఎల్ఓలు ముందస్తుగా సమాచారం అందించాలని



ఆదేశించారు. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు, అక్టోబర్ 15 వరకు నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయాన్ని అందించాలని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ అన్సారి, గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**అశ్వారావుపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదేశాల మేరకు అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, షూస్ పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, కోవాసి రాజు, నరాల శ్రీనివాసరావు, నల్లపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. విద్యా సామగ్రి పంపిణీపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం



చేశారు



## తల్లాడలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**తల్లాడ, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆధునిక భారత నిర్మాణం, సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని లక్ష్మారెడ్డి అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు భయపడొద్దు: డాక్టర్ రోహన్‌రెడ్డి

**ఖమ్మం, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ఊపిరితిత్తుల వ్యాధులకు ఆధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నందున ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని యశోద ఆసుపత్రి థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్, క్షయ, సీఓపీడీ తదితర సమస్యలకు మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ థొరాసిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైన రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా నిపుణులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యశోదా ఆసుపత్రి సీనియర్ మేనేజర్ శ్రీధర్,అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు



## భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్

**లక్షెట్టిపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
పెండింగ్‌లో ఉన్న భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. లక్షెట్టి పేట, హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించిన ఆయన భూ సంబంధిత దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. రికార్డులను పరిశీలించి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో గుర్తించిన అనామలీస్‌పై నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులు బోడ శ్రీకాంత్, ప్రవీణ్‌లను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.

## పారిశుద్ధ్యం, వనమహోత్సవంపై కీలక నిర్ణయాలు



**అశ్వారావుపేట, ఆగస్టు 20 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అశ్వారావుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పట్టణ పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధిపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చికెన్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం సేకరించి వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించారు. వనమహోత్సవంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ఇద్దరు లేబర్లను మూడు నెలల పాటు నియమించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణ పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ జూపల్లి శశికళ, మున్సిపల్ కమిషనర్ తూడి దిలీప్ రెడ్డివైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, అకౌంటెంట్ మక్కెళ్ళ చిన్నబాబు, వివిధ వార్డుల కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూపారెడ్డి మృతికి శ్రీనిధి స్కూల్ యాజమాన్యం సంతాపం




**ఖమ్మం/మధిర, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో హత్యకు గురైన నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతికి శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. గురువులకు రక్షణ కల్పించడం సమాజ బాధ్యత అని స్కూల్ కరెస్పాండెంట్, సెక్రటరీ బి.అంజన్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ చందు, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లాలు తండా వద్ద రోడ్డు ప్రమాదం



**టేకులపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ వాణి):**
లక్ష్మీదేవిపల్లి మండలం లాలు తండా వద్ద బైక్ అదుపుతప్పి పడటంతో మైలారం గ్రామానికి చెందిన రైతు ఎం.యాకాంత్ (43) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ జి.రాధా, పైలట్ ధరావత్ దేవా ఘటనా స్థలికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు అభినందించారు.

# కష్టసమయంలో నన్ను కాపాడింది ఆ సినిమానే..

## అదితి శంకర్ ఎమోషనల్

కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు శంకర్ కుమార్తెగా రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన అదితి శంకర్, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును, ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటున్న ఈ భామ, త్వరలోనే 'వన్స్ మోర్' చిత్రంతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామాలో అర్జున దాస్ సరసన అదితి హీరోయిన్‌గా నటించగా, మిలియన్ డాలర్ స్టూడియోస్ బ్యానర్‌పై యువరాజ్ గణేశన్ నిర్మించారు. సోనా





ఒలికల్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ సినిమా ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న అదితి శంకర్, ఈ ప్రాజెక్ట్ తనకు దక్కిన సమయం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కథ వినడానికి ముందు ఈ సినిమా నిర్మాత ఎవరని అడిగి తెలుసుకున్నానని, మిలియన్ డాలర్ స్టూడియోస్ సంస్థ కథల ఎంపికలో మంచి అభిరుచి కలిగి ఉంటుంది కాబట్టి కథ వినడానికి ఆసక్తి చూపించానని తెలిపారు. దర్శకుడు శ్రీకాంత్ కథ చెప్పడం ప్రారంభించిన కేవలం 15 నిమిషాల్లోనే ఈ సినిమా చేయడానికి ఓకే చెప్పేశానని అన్నారు. ఆ సమయంలో తనపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్, నెగెటివిటీ వచ్చాయని, ఆ ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడటానికి ఈ సినిమా తనకు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని అదితి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది 2 గంటల 15 నిమిషాల నిడివితో సాగే స్వచ్ఛమైన రొమాంటిక్-కామెడీ చిత్రమని, థియేటర్ల నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రేక్షకులకు ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చెప్పారు.

# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్



అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బడ్జెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.

# టాక్సిక్ ..పెద్దల సినిమా మాత్రమే

## పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్



సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.

# ఓటిటిలోకి శ్రీనివాస మంగాపురం



తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.



# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

## వాయిదా వార్తలను ఖండించిన టీమ్

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్



పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.


Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S) Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com